క్లుప్తంగా

కొరువాడ బీసీ హాస్టల్ విద్యార్థుల ధర్నా



వసతిగృహం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు : కొరువాడ బీసీ బాలుర వసతిగృహం భవనం వర్షం పడితే కారిపోతోందని విద్యార్థి సంఘం నాయకులు కె.రమేష్, ప్రవీణ్ కుమార్, బి.రమేష్ తెలిపారు. వసతిగృహానికి మరమ్మతులు చేపట్టడం లేదా కొత్తగా నిర్మాణం జరిపేంత వరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని హాస్టల్ ఎదుట సోమవారం విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కె.గోవిందరావు మాట్లాడుతూ వర్షం పడితే విద్యార్థులు పడుకునేందుకు ఇబ్బందులు పడుతుండడంతో పాటు పుస్తకాలు తడిచిపోతున్నాయన్నారు. వసతిగృహ సమస్యపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదును చేసి రెండు నెలలు గడుస్తున్నా పరిష్కారం కాలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా భవనం సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్

నాతవరం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని జిల్లేడుపూడి గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 95 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి రక్త పరీక్షలు చేసి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీళ్లు తాగాలన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో 120 మందికి నేత్ర పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

గొలుగొండ: భగవాన్ సత్యసాయి జయంతి సందర్భంగా సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏఎల్‌పురం గ్రామంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కొంకసింగి, నాగాపురం, ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట ప్రాంతాల నుంచి 120 మంది రోగులకు శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి సిబ్బంది నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 30 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం విశాఖకు తరలించినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు నాగలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గొండుపాలెంలో 135 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మాదంనాయుడు

కె.కోటపాడు : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు సూచించారు. గొండుపాలెంలో సోమవారం సంచార చికిత్స వైద్య సేవల్లో భాగంగా 135 మందికి ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుపుకోవాలని గర్భిణులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జె.సన్యాసిరావు, ఏఎన్‌ఎం పార్వతి, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజమే లక్ష్యం



తూటిపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాకవరపాలెం: పొగాకు రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం భీమారావు కోరారు. పాఠశాల విద్యార్థులతో కలసి సోమ వారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల కారణంగా జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యవతి, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రాము, లోవరాజు, సుధామాధవి పాల్గొన్నారు.

- వంతెనలు, మదుంలు కూలుతున్నా యథేచ్ఛగా రాకపోకలు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ, పోలీసులు, ఆర్టీఏ అధికారులు

బీఎన్ రోడ్డులో ఆగని భారీ వాహనాలు

కూలిన వడ్డాది పెద్దేరు వంతెనపై వెళ్తున్న లారీలు



బుచ్చెయ్యపేట: భీమునిపట్నం-నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు ఆగలేదు. బ్రిటీష్ కాలం నాటి ఈ రోడ్డు శిథిలమైంది. ఆరు దశాబ్దాలు క్రితం నిర్మించిన వంతెనలు, మదుంలు, బ్రిడ్జిలు కూలిపోతున్నాయి. వడ్డాది పెద్దేరు నదిపైన, విజయరామరాజుపేట తాచేరు వంతెనపై ఉన్న వంతెనలు ఇప్పటికే కూలిపోగా.. గోవాడ బ్రిడ్జి బీటలు వారి కూలడానికి సిద్ధంగా ఉంది. శింగవరం, లోపూడి, వెంకన్నపాలెం తదితర గ్రామాల వద్ద మదుంలు కుంగిపోయి ఇప్పటికే రోడ్డు మధ్యన పెద్ద గోతులు పడ్డాయి. రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ప్రమాదాలు జరగకుండా స్థానికులు గోతుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సాధారణంగా 30 నుంచి 40 టన్నుల వరకు బరువున్న వాహనాలు తిరిగే బీఎస్ రోడ్డులో వంతెనలు, మందుంలు కూలుతున్నా భారీ వాహనాలు తిరుగుతున్నాయి. 70 నుంచి 80 టన్నులకుపైగా బరువున్న గ్రానైట్ లారీలు, రాయి, పిక్క లోడులతో లారీలు జోరుగా తిరుగుతున్నాయి. అధిక బరువున్న వాహనాలు తిరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికే వడ్డాది, రోలుగుంట, కొత్తకోట, మేడివాడ తదితర గ్రామాల్లో యువకులు భారీ వాహనాలు తిరగకుండా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తే కొంత మంది లారీ డ్రైవర్లు ఈ వాహనాలు రాజకీయ నాయకులకు చెందినవంటూ బెదిరింపులకు దిగుతున్నారు. రాత్రి 10 గంటల తరవాత అధిక బరువున్న గ్రానైట్, రాయి, పిక్క లారీలు తిరుగుతున్నా నిరోధించాల్సిన పోలీసులు, ఆర్టీఏ, ఆర్ అండ్ బీ అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంగారు మెట్ట, ఎల్‌బీ పురం, లోపూడి, శింగవరం తదితర గ్రామాల వద్ద రోడ్డు ఇప్పటికే అధిక బరువున్న వాహనాల రాకపోకలు కారణంగా పెద్ద గోతులు పడ్డాయి. వడ్డాది, విజయరామరాజుపేట వంతెనల వద్ద డైవర్షన్ రోడ్లు వర్షాలకు కొట్టుకుపోవడంతో ఇప్పటికే అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల ప్రయాణికులు తీవ్ర రవాణా కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీఎస్ రోడ్డులో భారీ వాహనాలు తిరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట, చోడవరం తదితర మండలాల ప్రజలతో పాటు మూడు జిల్లాల ప్రయాణికులు కోరుతున్నారు.



బీఎన్ రోడ్డులో భారీ లోడుతో వెళ్తున్న గ్రానైట్ లారీ



ఎల్‌బీ పురం వద్ద దెబ్బతిన్న రోడ్డు



భారీ వాహనాలకు శింగవరం రోడ్డు మధ్యన కూలిన మదుం

కలిగొట్ల పీఏసీఎస్ కమిటీ సభ్యులకు సత్కారం

దేవరాపల్లి: మండలంలోని కలిగొట్ల పీఏసీఎస్‌కు నూతనంగా నియామకమైన త్రిసభ్య కమిటీ చైర్మన్ దొగ్గ దేముడునాయుడు అభినందన సభ కలిగొట్లలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు పోతల శ్రీనివాసరావు, సున్నాగొప్పల నర్సింహరావులను సత్కరించి అభినందించారు.

గాలికుంటు వ్యాధి టీకా పోస్టర్ ఆవిష్కరణ

గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం పోస్టర్‌ను కలిగొట్లలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పశు సంవర్ధకశాఖ ఏడీ దినేష్‌కుమార్ మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చే నెల 15 వరకు జరుగుతుందని, మూడు నెలలు దాటిన పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొప్పల వెలమ చైర్మన్ పీవీజీ కుమార్, పాత్రునాయుడు, స్థానిక పశువైద్యులు జి.గాయత్రీదేవి, కె.మంజుషారాణి, జి.ప్రియాంక పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నాతవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు మండలంలో గల అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలన్నారు.

విద్యార్థులపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలి



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి చదువుపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలని ఎంఈవో కె.సత్యనారాయణ సూచించారు. మండలంలో బొట్టవానిపాలెం ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు టీచర్ హ్యాండ్ బుక్స్‌ను విధిగా అమలు చేయాలన్నారు. లెసన్ ప్లానింగ్ ప్రకారం బోధన సాగాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ మెనూ ప్రకారం అమలు జరిగేలా చూడాలని ఎంఈవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై పట్టు సాధించాలి



అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రసాదరావు, తదితరులు

మాకవరపాలెం: సాంకేతికతపై విద్యార్థులు పట్టు సాధించాలని స్టీల్ ప్లాంట్ మెటీరియల్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు సూచించారు. తామరంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, తదితరులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ ఇంజినీర్లకు జ్ఞానమే పెట్టుబడన్నారు. రాంకో సిమెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సికిందర్‌బాషా మాట్లాడుతూ విజ్ఞానాన్ని ఆచరణలో పెట్టిన వారే ఇంజినీర్లుగా రాణిస్తారన్నారు. అనంతరం వివిధ సాంకేతిక నమూనాలను రూపొందించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

నాతవరం: ప్రభుత్వం కొత్తగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులను స్థానిక డీలర్లతో లబ్ధిదారులకు అందజేస్తామని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఓ.చందనలేఖ తెలిపారు. మండలంలో మర్రిపాలెం గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాతవరం మండలానికి 21,474 కార్డులు, నర్సీపట్నం మండలానికి 26,875, గొలుగొండ మండలానికి 17,249 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయన్నారు. ఈ కార్డుల కోసం డీలర్లు డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు పోతల సత్యవేణి పాల్గొన్నారు.

రావికమతం: తట్టబందలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చోడవరం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోకివాడ రమణ, ఎంపీటీసీ శేషుబాబు, తహశీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జూట్ బ్యాగుల పంపిణీ



శెట్టిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు జూట్ బ్యాగుల పంపిణీ

కశింకోట: మండలంలోని బయ్యవరంలో ఉన్న సాగర్ సిమెంట్ యాజమాన్యం ప్రతినిధులు శెట్టి పాలెం (మాకవరపాలెం మండలం) ప్రాథమికోన్న త పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి నిలిపివేయాలని, పర్యావరణహితమైన జూట్ సంచులు వినియోగించాలని సూచించారు. జూట్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేసి కాలుష్య రహిత భవిష్యత్ కోసం నడుం బిగిస్తామంటూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ అల్లు రామునాయుడు ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సాగర్ సిమెంట్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేవీఎల్ ప్రవీణ, ఉపాధ్యాయులు జి.కరుణ, దేవి, సాగర్ సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుమందానిపేటలో అగ్ని ప్రమాదం

బుచ్చెయ్యపేట: మండలంలో కుమందానిపేటలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. యల్లపు సూర్యకాంతం తమ ఇంట్లో ఉదయం దేవుడి గదిలో దీపం పెట్టింది. ప్రమాదవశాత్తు దీపం పడిపోయి ఇల్లు మొత్తం కాలిపోయింది. ఇంట్లో నిత్యావసర సరకులు, సామగ్రి, విద్యుత్ వైర్లు మొత్తం కాలిబూడిదయ్యాయని బాధితురాలు సూర్యకాంతం ఆవేదన వ్యక్తం చేశారు.

పెన్షన్ సదుపాయం కోసం ఉపాధ్యాయుల నిరసన



కె.కోటపాడులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కె.కోటపాడు : డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నిరసన వారంలో భాగంగా కె.కోటపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రస్తుతం అమలులో ఉన్న ఎసైస్‌మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు ఆర్.సూరిబాబు, కామేశ్వరరావు, సూర్రెడ్డి బాబూరావు, కిలపర్తి శ్రీనివాసరావు, బోకం ప్రసాద్ పాల్గొన్నారు.

చోడవరం: నిరసన వారం ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు సోమవారం చోడవరం తహసీల్దార్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న 4డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం అమలు చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమరాన త్రినాథరావు కోరారు. ఈ ఆందోళనలో చోడవరం తాలూకా పరిధిలో ఉన్న చోడవరం, బుచ్చెయ్యపేట, చీడికాడ, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు ఆర్.చిరంజీవి, కె.మల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు గొల్లు శ్రీను వాసరావు, టీచర్స్ కో-ఆపరేటివ్ కార్యదర్శి ఆర్‌వీఎస్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

నర్సీపట్నం: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా జోన్ ఇన్‌చార్జి పడాల అప్పారావు, జిల్లా కార్యదర్శి .దాసు మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదు తరగతిలో మోడల్ ప్రాథమిక పాఠశాల, బేసిక్ ప్రాథమిక పాఠశాలలనే కొనసాగించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్జీటీ పోస్టులు ఉండేలా చూడాలన్నారు. 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండో సెక్షన్ ఇవ్వాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.దొర, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, నర్సీపట్నం శాఖ అధ్యక్షుడు ఎల్.వై.పాత్రుడు, అధ్యక్షుడు ఎస్.శ్రీరామ్మూర్తి, జిల్లా కౌన్సిలర్ ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



వడ్డాదిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నారావును సన్మానిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: మండలానికి చెందిన పాఠశాల ఉపాధ్యాయురాలు, కళాశాల ప్రిన్సిపాల్ రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఈ నెల 5న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని సోమవారం వడ్డాది హైస్కూలులో సన్మానించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నారావు, వడ్డాది ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాలల టీచర్ నిమ్మల రమను స్థానికులు సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన్‌రావు, ఎంపీటీసీ కోరుకొండ రమణ, పాఠశాల కమిటీ చైర్మన్‌లు వంగలి అప్పారావు, తురాయి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పౌర్ణమి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమైన ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్

రోలుగుంట: జిల్లాలో గౌరీపరమేశ్వర ఉత్సవాలు అనకాపల్లి తరువాత రోలుగుంటలోనే వైభవంగా నిర్వహిస్తారు. ఈ మేరకు ఈ వేడుకల ఏర్పాట్ల కోసం వైఎస్సార్‌సీపీ నాయకురాలు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ గృహంలో సోమవారం ఉత్సవ కమిటీ చైర్మన్ పోతల లక్ష్మీ శ్రీనివాస్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గౌరీ పౌర్ణమి ఉత్సవాన్ని వచ్చే నెల 6న చేయాలని, ఉత్సవ మూర్తుల విగ్రహాల తయారీకి ఈ నెల 17న మట్టిని సేకరించాలని, ఈ నెల 24న ప్రధాన కుటుంబాలను కమిటీతో కలిసి ఉత్సవ ఏర్పాట్లు చేయాలని అర్చకుడు కంచుగుమల రాంబాబు ముహూర్తం పెట్టారు. మాజీ ఉప సర్పంచ్ మడ్డు తాతబాబు, చెట్టుపల్లి వెంకట్రావు, రుత్తల నాని బాబు, పిల్లి శ్రీను, కాళ్ల నాయుడు, బళ్లా త్రినాథ్, మడ్డు చంటమ్మ శ్రీను, తమరాన సత్యనారాయణ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఇంజినీర్లకు సన్మానం

నర్సీపట్నం: ఇంజినీర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఇంజినీర్లు గొలుసు శ్రీనివాసరావు, కాకర్ల శివ సత్యనారాయణను సోమవారం సన్మానించారు. శ్రీనివాసరావు ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఎన్టీపీసీ లిమిటెడ్‌లో డీజీఎంగా, జిందాల్ పవర్‌లో జనరల్ మేనేజర్‌గా సేవలు అందించారని, సత్యనారాయణ సివిల్ ఇంజినీర్‌గా నర్సీపట్నం డివిజన్‌లో 30 ఏళ్ల సేవలు అందించారని క్లబ్ రీజనల్ చైర్మన్ సిహెచ్.ఇందిరా, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి రామ్‌గోపాల్, బేతిరెడ్డి విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

కొలువుల సాధనకు గ్రంథాలయం దోహదం



కొత్త ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సీఐ గోవిందరావు, ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదివి ఉపాధ్యాయ కొలువులు సాధించిన వారిని సోమవారం టౌన్ సీఐ గోవిందరావు, ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర సత్కరించారు. గ్రంథాలయంలో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలను చదివి ఉద్యోగం సాధించటం అభినందనీయమని వారు అభినందించారు. గ్రంథాలయ సేవలను వినియోగించుకుని 8 మంది ఉద్యోగాలు సాధించటం తనకు చాలా సంతోషంగా ఉందని లైబ్రేరియన్ దమయంతి అన్నారు.

రేపటి నుంచి 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' శిబిరాలు



జిల్లా అదనపు వైద్యాధికారి వీరజ్యోతి

నర్సీపట్నం: ఈ నెల 17 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు నిర్వహించే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఎక్కువ ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. మహిళలు, పిల్లలు ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

కె.కోటపాడు : ఈ నెల 17 నుంచి 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. ఆరోగ్యకరమైన మహిళలతోనే బలమైన కుటుంబాలు సాధ్యమని ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. ఈ శిబిరాలను పీహెచ్‌సీ పరిధిలోని 10 సచివాలయాల్లో నిర్వహిస్తామన్నారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము క్యాన్సర్ పరీక్షలతో పాటు పౌష్టికాహారం తీసుకునే విధానం, తల్లీబిడ్డకు ఆరోగ్య పరీక్షలు, వయో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిబిరాలను వచ్చేనెల 2 వరకూ నిర్వహించనున్నామన్నారు.

రోలుగుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వస్థ్ నారి సశక్త్ పరివార్ శిబిరాలను నిర్వహించనున్నట్టు వైద్యాధికారి శ్రావణి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల ఆశాలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందికి ఈ కార్యక్రమంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం అనేదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్.కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ సాజహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 22 ఫిర్యాదులు



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 22 ఫిర్యాదులు వచ్చాయి. ఆర్డీవో వి.వి.రమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బలిఘట్టంకు చెందిన ముత్యాల నాగలక్ష్మి స్థల సమస్యను పరిష్కరించాలని అర్జీ పెట్టుకున్నారు. భూ సమస్యను పరిష్కరించాలని గొలుగొండకు చెందిన అడిగర్ల సత్యవతి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. జీడి పిక్కల ఫ్యాక్టరీ వల్ల వ్యర్థాలు వ్యాపిస్తున్నాయని నాతవరం మండలం వెన్నలపాలెంకు చెందిన నందిపల్లి సూర్యప్రకాష్‌రాజు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. వితంతువు పింఛన్ ఇప్పించాలని నాతవరం మండలం లింగంపేటకు చెందిన అల్లు సత్యవతి దరఖాస్తు చేశారు. భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గొలుగొండ మండలం పాకలపాడుకు చెందిన బొడ్డు ప్రసాద్ ఫిర్యాదు చేశారు. నలంద పబ్లిక్ స్కూల్‌లో ఫీజులు ఎక్కువగా తీసుకుంటున్నారని నర్సీపట్నం మున్సిపాలిటీ 6వ వార్డుకు చెందిన పి.మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆర్డీవో ఆదేశించారు. ప్రతీ సమస్యకు జవాబుదారీతనం ఉండాలన్నారు. పరిష్కరించేందుకు వీలుపడని అర్జీలకు కారణం ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.